నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 12 ఫిబ్రవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

# కాంగ్రెస్ హనీమూన్ ముగిసింది

- హామీలు నెరవేర్చే వరకూ బీఆర్ఎస్ పోరాటం ఆగదు
- తెలంగాణ ప్రజల కోసం రేవంత్‌రెడ్డి కంట్లో నలుసునౌతా..
- స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలి
- కార్యకర్తలకు అండగా ఉంటా.. ఎవ్వరూ భయపడొద్దు..
- హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఖమ్మం నేతల మీటింగ్‌లో కేటీఆర్
- ఖమ్మం ప్రజలకు అండగా ఉంటా: మాజీ మంత్రి అజయ్



ఖమ్మం, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హనీమూన్ పర్యటన ముగిసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాసంలో జరిగిన ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ఆయన కంట్లో నలుసుగా బీఆర్ఎస్ ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా కేసీఆర్ పాలననే ప్రజలు కోరుకుంటున్నారని, ప్రజల సంక్షేమాన్ని మరిచి వారి స్వలాభం కోసమే మంత్రులు పని చేస్తున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని పేర్కొన్నారు. ఒక మంత్రి కమీషన్లు, కాంట్రాక్టుల కోసమే పని చేస్తున్నారని, మరో మంత్రి 10-30 శాతం కమీషన్లు తీసుకుంటున్న విషయం బహిర్గతమేనని, మరో మంత్రి తానొకటి చెప్తే సీఎం మరొకటి చెప్తారని ధ్వజమెత్తారు. ఖమ్మంలో వరదలు వస్తే ముంపు ప్రాంత ప్రజలు అజయ్‌ను గుర్తుకు తెచ్చుకున్నారని, కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోయామని తెలుగు డిక్షనరీలో లేని బూతులను విన్నామని కేటీఆర్ గుర్తుచేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని, రూ.లక్ష కోట్ల బడ్జెట్ అందిస్తామని, బీసీ సబ్ ప్లాన్‌ను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కేసీఆర్ నిర్వహించిన సర్వేలో బీసీలు 51శాతం ఉంటే కాంగ్రెస్ సర్వేలో 46శాతం తేల్చారని, మిగిలిన 5శాతం బీసీలు ఎక్కడికెళ్లారని కేటీఆర్ ప్రశ్నించారు. ఖమ్మం పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వల్ల తాను ఆశ్చర్యానికి గురయ్యానని, రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమేనన్నారు.

కేసీఆర్ అన్నట్లుగా గెలిస్తే పొంగేది లేదు.. ఓడితే కుంగేది లేదని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ, రైతుబంధు ఏమయ్యాయని ప్రశ్నించారు. 2014కు ముందు ఖమ్మం ఎలా ఉంది, ప్రస్తుత ఖమ్మం ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. పువ్వాడ అజయ్ ఇంటింటికీ తిరిగి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంచారని, మురుగు కాల్వల్లో తిరిగి మురికిని శుభ్రం చేసినప్పటికీ ప్రజలు గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ప్రజలను ఆశల పల్లకిలో ఉంచిన కాంగ్రెస్ నాయకులు, ప్రజలను మరోమారు మోసం చేశారని, కేసీఆర్ రూ.లక్ష ఇస్తే, కాంగ్రెస్ తులం బంగారం అని, రూ.10 వేలు ఇస్తే రూ.15 వేలు అని, రూ.2 వేలు ఇస్తే రూ.4 వేలు అని అందమైన అబద్ధాలు చెప్పి ప్రజలను మోసగించిందన్నారు. ప్రజలు ఎన్నిరకాలుగా రేవంత్‌రెడ్డిని తిట్టినా దులుపుకొని పోతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు నెరవేర్చే వరకు గల్లా పట్టుకొని నిలదీస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారులు పోలీసుల అండతో సీట్లు కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని, వాటన్నింటినీ ఎదురించి బీఆర్ఎస్ సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఖమ్మంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై ఎలాంటి అక్రమ కేసులు పెడుతున్నారో తాను చూస్తున్నానని, మనో ధైర్యం కోల్పోకుండా ప్రజల కోసం పోరాడాలని, అలాంటి వారికి తాము అండగా ఉంటామని, ఎలాంటి భయం అవసరం లేదని భరోసా కల్పించారు. ఖమ్మం జిల్లాలో ప్రత్యేక రాజకీయ సమీకరణాల వల్ల బీఆర్ఎస్‌కు కొంతనష్టం జరిగిందన్నారు. ఓడిపోయినా కూడా బీఆర్ఎస్ నాయకులు, గులాబీ దండు ఏడాది కాలంలో ప్రజలకు అండగా ఉందన్నారు. ఒక కుటుంబం వరదలో చిక్కుకుంటే కనీసం హెలికాప్టర్ తెప్పించి రక్షించాలనే సోయి ఈ మంత్రులకు లేదన్నారు. ఎమ్మెల్యేల పుట్టినరోజు వేడుకలు, ఇంకా వేరే పనికిమాలిన పనులకు మంత్రులు హైదరాబాద్ నుంచి కూతవేటు దూరానికి కూడా హెలికాప్టర్‌లో పోతున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో వరదలు వస్తే భూపాలపల్లి జిల్లాలోని మారుమూల గ్రామాలకు కూడా నాలుగు హెలికాప్టర్లను పంపి ప్రజలను కాపాడామని గుర్తుచేశారు. ఖమ్మంలో వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత కాంగ్రెస్ మంత్రులు పర్యటించారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓపెన్ టాప్ జీపులో చేతులు ఊపుతూ కాలు కింద పెట్టకుండా అటూ ఇటూ తిరిగి వెళ్లిపోయాడని అన్నారు. ప్రజలు తిడుతున్న తిట్లను వింటే పౌరుషం ఉన్న ఎవడైనా బకెట్ నీళ్లలో దూకి చచ్చేవాడని, కానీ రేవంత్‌రెడ్డికి రోషం లేదు కాబట్టి అన్నీ దుపులుకొని తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. స్కూటీలు ఏమయ్యాయని కాలేజీ పిల్లలు కూడా పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారని అన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉచిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను నెరవేర్చే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లాలో పునర్ వైభవం సాధించేందుకు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ మాజీ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు, అన్నివర్గాల శ్రేణులు కలిసికట్టుగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజా సమస్యలపై చొరవగా స్పందిస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని సూచించారు. ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సత్తా చాటి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి కానుకగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బొమ్మెర రామ్మూర్తి, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు వీరూనాయక్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ ఖమ్మం నేతల సమావేశంలో మాట్లాడుతున్న అజయ్, చిత్రంలో కేటీఆర్


పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు

# కేసులకు బెదిరేది లేదు..

- లగచర్ల బాధితుల కోసం కేటీఆర్ పోరాట స్ఫూర్తితో ఉద్యమిస్తాం
- లక్కినేని సురేందర్, రాజులపై బనాయించింది అక్రమ కేసే..
- జిల్లా జైల్లో ములాఖత్ ద్వారా పరామర్శించిన ఎమ్మెల్సీ తాతా మధు


జైలులో పార్టీ నాయకులను పరామర్శించి బయటకు వస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 11 : అక్రమ కేసులకు భయపడేది లేదని, లగచర్ల బాధితుల కోసం కేటీఆర్ చేసిన పోరాట స్ఫూర్తితో పోరాడుతామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. కాంగ్రెస్ నాయకుల అక్రమ కేసులతో జిల్లా జైలులో ఉన్న టేకులపల్లి మండలం బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్, టేకులపల్లి బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా రాజులను తాతా మధు.. భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, రూరల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్‌తో కలిసి ములాఖత్ ద్వారా మంగళవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో తాతా మధు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సూచన మేరకు పోలీసులు అత్యుత్సాహంతో సురేందర్, రాజుపై ఎస్టీ, ఎస్సీ అట్రాసిటీతోపాటు ఇతర కేసులు పెట్టి జైలుపాలు చేశారని ఆరోపించారు. వారికి పార్టీ అండగా ఉంటుందని, న్యాయ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉందని చెప్పామన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ల నాయకత్వంలో కాంగ్రెస్ నాయకులు చేసే కుట్రలు, కుతంత్రాలను ఎదుర్కొంటామన్నారు. లగచర్ల ఘటనలో కేటీఆర్ న్యాయ పోరాటం చేసి చివరకు ప్రభుత్వం మెడలు వంచారని గుర్తు చేశారు. అక్రమ కేసుల వైఖరిని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులు మానుకోవాలని, కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్రామగ్రామాన వ్యతిరేకత వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అంటేనే ఉద్యమ పోరాట సారథులని, కాంగ్రెసోళ్లు భయపెడితే భయపడే వారు బీఆర్ఎస్ కార్యకర్తలు కాదన్నారు. రాబోయే రోజుల్లో తిరిగి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు ఏ పోలీసు అధికారులైతే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారో వారి రిటైర్డ్ అయినా, లేదా ఏ పోస్టులో ఉన్నా తగిన శాస్తి చెబుతామని తాతా మధు హెచ్చరించారు.

## మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి: కలెక్టర్

ఖమ్మం, ఫిబ్రవరి 11: జిల్లాలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు గాను మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పోలింగ్ సిబ్బంది పూర్తి చేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన ఈ ప్రక్రియలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 577 గ్రామ పంచాయతీలు, 5,266 వార్డుల పరిధిలో మొత్తం 5,284 పోలింగ్ కేంద్రాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పీవో, ఏపీవోలను నియమించాలన్నారు. 20 శాతం బఫర్‌తో కలిపి పోలింగ్ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సంఘం కేటాయించిన ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. డీపీవో ఆశాలత, ఆర్డీవోలు నరసింహారావు, ఎల్.రాజేందర్, జడ్పీ డిప్యూటీ సీఈవో నాగ పద్మజ, డీఎల్‌పీవో రాంబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్

### నెల దాటినా బోనస్ రాలే..



మద్దుకూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో నెల రోజుల క్రితం 106 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాను. నాకు ఇప్పటివరకు బోనస్ డబ్బులు రాలేదు. అధికారులను అడిగితే.. మా చేతుల్లో ఏమీలేదని, ప్రభుత్వం ఎప్పుడు ఇస్తే అప్పుడు మీ ఖాతాల్లో పడుతాయని చెబుతున్నారు. నాకు రుణమాఫీ రాలేదు. రైతు భరోసా రాలేదు. అట్లాగే రైతు బోనస్ వస్తుందో.. రాదో అర్థం కావడం లేదు. ప్రభుత్వానికి రైతుల ఉసురు తగుల్తది.

**–నల్లమోతు వెంకటనారాయణ, రైతు, మద్దుకూరు, చంద్రుగొండ మండలం**

### నెలన్నరైనా నయాపైసా రాలేదు..



సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడంతో ఈసారి మొత్తం సన్న వడ్లను సాగు చేసినం. బాగానే పెట్టుబడి పెట్టినం. అప్పు చేసి మరీ సన్నాలు పండించాం. బోనస్ వస్తే పెట్టుబడులు తీరుతాయని అనుకున్నాం. అందుకోసం సహకార సొసైటీకి వెళ్లి వడ్లు విక్రయించాం. ఇప్పటికి నెలా పదిహేను రోజులు దాటిపోయింది. కానీ మా బ్యాంకు ఖాతాలో బోనస్ నగదును జమ చేయలేదు. ఇదేమిటని అధికారులను అడిగితే.. 'వస్తాయమ్మా.. కొన్నిరోజులు ఆగండి..' అని చెబుతున్నారు. **–కొమరం కాంతమ్మ, మహిళా రైతు**

### డిసెంబర్ నుంచి ఎదురుచూస్తున్నా..



నేను డిసెంబర్ చివరి వారంలో రెండుసార్లు బేతంపూడి సొసైటీలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో 62 క్వింటాళ్ల వరి ధాన్యం వేశాను. దానికి సంబంధించిన డబ్బులు జనవరి 8న నా ఖాతాలో పడ్డాయి. కానీ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా బోనస్ రూ.500 చొప్పున బోనస్ డబ్బులు ఇంతవరకు పడలేదు. డిసెంబర్ నుంచి బోనస్ డబ్బులు ఎప్పుడు పడతాయా.. అని ఎదురు చూస్తున్నా. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం బోనస్ డబ్బులు వేయాలి.

**–నారందాస్ కోటయ్య, రైతు, బొమ్మనపల్లి**


### ఖాతాలో డబ్బులు జమ కాలేదు..



డిసెంబర్ నెలలో 92 క్వింటాళ్ల ధాన్యం బేతంపూడి సొసైటీలో వేశాను. అందుకు సంబంధించిన డబ్బులు జనవరి నెలలోనే నా ఖాతాలో పడ్డాయి. కానీ.. బోనస్ డబ్బులు రూ.500 చొప్పున ఇప్పటివరకు పడలేదు. దీనిపై సొసైటీ అధికారులను అడిగితే వస్తాయి అని చెబుతున్నారే తప్ప ఇంతవరకు పడలేదు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని బోనస్ డబ్బులు త్వరగా వచ్చే విధంగా చూడాలి. రైతుల ఇబ్బందిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.

**–పొగాకు పాపారావు, రైతు, అనిశెట్టిపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలం**

# బోనస్ గీనస్ లేదు



- వడ్లు విక్రయించి యాభై రోజులు దాటినా రూ.500 జాడ లేదు..
- ధాన్యం అమ్మిన వెంటనే బ్యాంకు ఖాతాలో వేస్తామన్నరు..
- రోజూ వెళ్లి చూసుకుంటున్నా రూపాయి కూడా పడలేదు..
- రెక్కలు ముక్కలు చేసుకుంటూ సన్న వడ్లు పండించాం
- క్వింటాకు రూ.500 బోనసంటే కష్టం మిగులుతుందని ఆశపడ్డాం
- కాయకష్టం చేసినం.. కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మినం..
- అయినా కనికరం లేదు.. నెలలు గడుస్తున్నా ఇవ్వట్లేదు..
- బోనస్ పేరు చెప్పి ఓట్లేయించుకున్నరు.. ఇప్పుడేమో ఏడిపిస్తున్నరు..
- ధాన్యానికి రూ.500 బోనస్ కోసం గోడుమంటున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు

**బోనస్ నగదు చెల్లింపుల్లోనూ కాంగ్రెస్ సర్కారు తన మాయమాటల మార్క్ చూపిస్తోంది. దీంతో అన్నదాతలు భగ్గుమంటున్నారు. వరి పంట పండించిన రైతుల్లో ఏ ఇద్దరు ఎదురుపడినా బోనస్ గురించే ఆరా తీస్తున్నారు 'బోనస్ డబ్బులు పడ్డయా మావా..' అంటూ యువ రైతులు పలుకరిస్తుండగా.. 'బోనస్ లేదు.. గీనస్ లేదు రా..' అంటూ వృద్ధ రైతులు నిట్టూరుస్తున్నారు. ఇలాంటి దృశ్యాలు పల్లెల్లో ప్రతి రోజూ పదుల సంఖ్యలో కన్పిస్తున్నాయి. సర్కారోళ్లకు వడ్లు విక్రయించి 50 రోజులు దాటిపోయిందని, క్వింటాకు రూ.500 చొప్పన ఇస్తామన్న బోనస్ డబ్బులకు జాడే లేకుండా పోయిందని వాపోతున్నారు. ధాన్యం అమ్మిన రైతులకు వెంటనే బోనస్ ఇస్తామని, రెండు రోజుల్లోనే బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని సాక్షాత్తూ ముఖ్యమంత్రే మాట ఇచ్చారని రైతులు గుర్తు చేస్తున్నారు. కానీ.. అవన్నీ మాయమాటలేనని, వడ్లు విక్రయించాక నెలల తరబడి ఎదురుచూస్తున్నా బోనస్ డబ్బులు మాత్రం వేయడం లేదని మండిపడుతున్నారు. రోజూ బ్యాంకుకు వెళ్లి బ్యాలెన్స్ చూసుకుంటున్నామని, బోనస్ డబ్బులు రూపాయి కూడా పడలేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధరకు పెట్టుబడి ఖర్చులు పోయినా.. క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తే రెక్కల కష్టమైనా మిగులుతుందని ఆశించామని అంటున్నారు. అందుకోసమే కాయకష్టం చేసి సన్న వడ్లు పండించామని, కష్టమైనా తీసుకెళ్లి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించామని చెబుతున్నారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి కనికరం లేదని, బోనస్ పేరు చెప్పి ఓట్లు వేయించుకుందని, కానీ.. ఇచ్చిన మాట ప్రకారం రూ.500 బోనస్ జమ చేయట్లేదని, నెలల తరబడి ఇవ్వకుండా ఏడిపించుకుతింటోందని గోడుమంటున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏ రైతును పలుకరించినా ఇదే ఘోసను వెళ్లబోసుకుంటున్నారు.** *-ఖమ్మం, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### బోనస్ రాక రెండు నెలలాయె..



నేను 30 క్వింటాళ్ల సన్న వడ్లు సహకార సంఘం వారికి అమ్మి రెండు నెలలు దాటింది. కానీ.. ప్రభుత్వం రైతులకు ఇస్తానని చెప్పిన క్వింటాకు రూ.500 చొప్పున అందించే బోనస్ ఇంతవరకు ఇవ్వలేదు. కొందరు రైతులకు మాత్రమే వేసి.. అందరు రైతులకు వేశామని గొప్పలు చెప్పుకోవడం సరికాదు. రైతులకు ప్రభుత్వ పాలన మీద నమ్మకం పోయింది. రైతుల కష్టాన్ని, ఇబ్బందులను అర్థం చేసుకుని ప్రభుత్వం వెంటనే బోనస్ డబ్బులు ఖాతాల్లో జమ చేయాలి.

**–నాగబోయిన కాళేశ్వరరావు, రైతు, నరసింహాపురం, ఎర్రుపాలెం మండలం**

### బోనస్ విషయంలోనూ మాయమాటలే..



రైతుభరోసా పేరిట ఇప్పటికే మమ్ములను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు వడ్లకు అందించే బోనస్ విషయంలోనూ మాయమాటలే చెబుతోంది. ప్రభుత్వానికి వడ్లు అమ్మిన వెంటనే క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ జమ చేస్తామంటూ హామీ ఇచ్చింది. కానీ వడ్లు విక్రయించి రోజులు గడుస్తున్నా బోనస్ మాత్రం ఇవ్వలేదు. ఇప్పటికే వానకాలం రైతుభరోసా ఇవ్వకుండా మోసం చేయడంతో సేటు దగ్గరకు వెళ్లి అప్పు తెచ్చుకున్నాం. ఇప్పుడు యాసంగి రైతుభరోసా ఇవ్వకుండా రెండో పంట వేయలేం. ఇక బోనస్ నగదు ఎప్పుడు జమ చేస్తరో ఏమో చూడాలి.

**–తెల్లం సత్యం, రైతు, చిన్నరాయిగూడెం, మణుగూరు**